

గుర్రపు డెక్కను తొలగించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోపంట కాలవల్లో గుర్రపుడొక్క వలన వర్షాకాలం వర్షపు నీరు వలన పల్లప్రాంతాలు మునిగి పంట నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. మండలంలోని చాగల్లు, నెలటూరు, చంద్రవరం, మల్లవరం, దారవరం పంట కాలువలో వంతెనల వద్ద గుర్రపు డెక్క కారణంగా పంట పొలాలు మునిగి పోతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు గుర్రపు డొక్కను నిర్మూలించి పంట ముంపు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



చాగల్లు వంతెన వద్ద కాలువలో గుర్రపుడెక్క

అన్నదాతకు పన్నుపోటు

- పురుగు మందులు, ఎరువులపైనా వడ్డన
- నాలుగేళ్లగా ఇదే పరిస్థితి
- ఏడాదికి రూ.90కోట్ల మేర భారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉమ్మడి జిల్లాలో రబీ,ఖరీఫ్ సీజన్‌లలో సుమారు 10 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు జరుగుతోంది. వ్యవసాయం, అనుబంధ రంగాలలో 50 శాతానికిపైగా ఉపాధి పొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి ప్రధాన రంగంపై జిఎస్‌టి బాదుడు గోరుచుట్టుపై రోకలి పోటులా మారుతోంది. ప్రతి ఏటా రూ.90 కోట్ల మేరకు భారం పడుతోందని తెలుస్తోంది. వరి సాగుకు పెట్టుబడి ఖర్చులు ఏటికేడు పెరిగిపోతుండగా అందుకు అనుగుణంగా దిగుబడుల ధరలు లభించని దుస్థితి నెలకొంది. దీంతో అన్నదాతలు ప్రతి సీజన్‌లోనూ అప్పుల ఊబిలోకూరుకుపోతున్నారు. ఆత్మస్థయిర్యం కోల్పోయి, కొందరు ఆత్మహత్యల బాటు పడుతుండగా,మరికొందరు సాగుకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు పన్నుల పేరుతో ఎడాపెడా బాదేస్తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుమందులపై విధిస్తున్న జీఎస్టీ (వస్తు సేవల పన్ను) కర్షకులను కుంగదీస్తోంది. జిల్లాలో 80 శాతం చిన్న, సన్నకారు రైతాంగమే కావడంతో వారు ఈ అదనపు భారం మోయలేక అల్లాడిపోతున్నారు.



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు

2017 నుంచి అమలు

కేంద్రప్రభుత్వం 2017 నుంచి జీఎస్‌టిని అమల్లోకి.. తెచ్చింది. అప్పటి నుంచి క్రిమిసంహారక మందులపై 18 శాతం యంత్ర పరికరాలపై 12 నుంచి 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తోంది. ఎరువులపై పన్నును 5 శాతానికి పరిమితం చేసి, విత్తనాలకు మాత్రం మిన పోయించి ఇచ్చింది మందులు, యంత్ర పరికరాలపై విధిస్తున్న పన్ను శాతంటే పెట్టుబడి ఖర్చులు పెరిగి పోతున్నాయని అన్నదాతలు అవేదన చెందుతున్నారు.ఇలా ప్రతిదానిపై జీఎస్టీ అంటుండటంతో రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. పురుగు ముందుల లావాదేవీలు రూ. 100 నుంచి. రూ.150 కోట్ల వరకూ జరుగుతుంటాయి. వ్యవసాయ ఉపకరణాలను ఏడాదికి రూ.110 కోట్ల వరకూ కొనుగోలు చేస్తుంటారు. వీటిపై కేంద్రం ఆధిక శాతం జీఎస్టీ విధించడం వలన ఏడానికి జిల్లాలోని రైతులకు రూ.50 కోట్లు మేర భారం పడుతోంది.

తప్పని సరి అవుతున్న ఎరువులు, పురుగుమందుల వినియోగం

రెండు దశాబ్దాల క్రితం రుతువులు కాలానుగుణంగా నడిచేవి. దానికి: తగ్గట్టుగానే పంటలకు చీడ పేదల బెడద తక్కువగా ఉండేది. కాలగమనంలో... రుతువులు కూడా గతి తప్పడం ప్రారంభమైంది. రకరకాల కొత్త తెగుళ్లు, చీడపీడలు పంటలకు ఆశించడం అధికమైంది. వీటి నివారణకు అనివార్యంగా రైతులు క్రిమి సంహారక మందులను పెద్దఎత్తున వినికారీ చేయడం మొదలుపెట్టారు. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరగడంతోపాటు, దిగుబడుల్లో నాణ్యత లోపిస్తోంది. ఈ సమయంలో గోరు చుట్టుపై రోకటి పోటు అన్న చందంగా జిఎస్‌టి వారిని మరింత బాధిస్తోంది.గతంలో పురుగుమందులపై పన్ను నామమాత్రంగా ఉండేది. -రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉండటంతో పరిస్థితిని బట్టి వెన్ను విధించేవారు. దీంతో ధరలు తక్కువగానే ఉండేవి. అయితే కేంద్రప్రభుత్వం పురుగుమందులను కూడా .జిఎస్‌టి పరిధిలోకి తీసుకెళ్లింది. పన్ను దశల వారీగా ప్రస్తుతం 18శాతానికి చేరింది. ఫలితంగా ఏటా 10 శాతం ధరలు అదనంగా పెరుగతూ ఉన్నాయి.

వ్యవసాయ రంగాన్ని మినహాయించాలని రైతుల వేడుకోలు

ఏటా పెట్టుబడి ఖర్చులు పెరగడం, మరో వైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకో వైపు దిగుబడులు సరిగా రాకపోవటం వంటి కారణాలతో కర్షకులు నష్టాల పాలవుతున్నారు. దీంతో ఎక్కువశాతం మంది సాగుకు దూరమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యామ్నాయం లేకపోవటంతో కష్టమైనా, నష్టమైనా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి జిఎస్‌టి పరిధి నుంచి వ్యవసాయాధారిత ఉపక రణాలను పరుగు మందులను మినహాయించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిసారీ జీఎస్టీ కౌన్సిల్ పన్నులు విధించే వస్తువులపై సమీక్ష చేస్తున్నా రైతుల వినతిని మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తమ కష్టాలను పరిగణనలోకి తీ కుని వ్యవసాయ పరికరాలు, పురుగుమందులు జీఎస్టీ నుంచి మినహాయిస్తే ఉపయుక్తంగా ఉంటుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వంటల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ మాధవీలత, పాల్గొన్న జెసి, ఎంఎల్‌ఎ రాజా

కొత్తగా 1.67లక్షల రేషన్ కార్డులు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-రాజానగరం

రాష్ట్రంలో త్వరలో ఒక లక్షా 67 వేల కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ జిల్లాకు నాలుగు వేల కొత్త కార్డులు రానున్నాయన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండల కార్యాలయాల ఆవరణలో పిడియస్ బియ్యంతో పలు రకాల వంటలు పోటీలు 2023 నిర్వహించారు. దీనిలో పిడిఎస్ బియ్యంతో కరివేపాకు అన్నం, జంతికలు, పులిహార, బిర్యాని, పొంగడాలు తదితర వంటలను రుచిగా ఏలా తయారు చేసుకోవచ్చు అనేది యాభై స్టాల్స్ మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఐసిడిఎస్ సంఘాల మహిళా ఏర్పాటు చేశారు. ఈ వంటలను కమీషనర్ అరుణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తదితరులు రుచి చూశారు. ఈ సందర్భంగా జెసి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యంలో అనేక పోషక విలువలు ఉన్నాయన్నారు. ప్రతీ వంద బియ్యం గింజల్లోను ఒక గింజ ఐరన్ కాల్షియం తదితర పోషక కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం ఉన్నాయని దీనికి ప్రభుత్వం సుమారు రూ.200 కోట్ల ఖర్చు చేస్తుందని తెలిపారు. దీనివలన మహిళలకు రక్తహీనత, ఐరన్ లోపం తదితర సమస్యల నుండి ఎదుర్కోడానికి ఉపయోగడుతుందన్నారు. రాష్ట్రంలో ఒక కోటి 46 లక్షల మంచి లబ్ధిదారులకు 2,11,511 టన్నుల బియ్యానికి రూ.846 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. సుమారుగా కేజీ బియ్యం రూ.40 ప్రభుత్వాని ఖరీదు అయితే కేవలం ఒక రూపాయికి పంపిణీ చేస్తుందన్నారు. ఖరీదైన పోషక విలువలు ఉన్న బియ్యాన్ని బహిరంగా మార్కెట్‌లో విక్రంచిన, అక్రమంగా రవణా చేసిన 6ఎ కేసులు నమోఆదు చేస్తామని హెచ్చరించారు. దీనిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో 5.64.571 రేషన్‌కార్డు లబ్ధిదారులకు 7943.034 టన్నుల బియ్యానికి రూ.31,73, 61,360 ఖర్చు చేస్తుందన్నారు. దీనిలో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఇంటువంటి కార్యక్రమాలు రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలన్నారు. వంటలు చేసిన 50 స్టాల్స్‌కు రూ.50 వేలు బహుమతిగా ఇస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో ఆర్‌డిఒ ఎ.చైతవర్షిణి, ఇన్‌చార్జి డిఎస్ఒ విజయభాస్కర్, మార్కెటింగ్ డిఎం ఎ.కుమార్, మండల కన్వీనర్ దూలం పెద్ద, జెడ్‌పిటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొలపాటి వెంకన్న, గంగిశెట్టి సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతలు

ఈ వంటల్లో ప్రథమ బహుమతి కరివేపాకు అన్నం చేసిన నందరాడకు చెందిన జే.వేణు రూ.10వేల, ద్వితీయ బహుమతి తాటి గారెలు చేసిన జి.ఎర్రంపాలెం చెందిన కె.లక్ష్మి దుర్గకు రూ.5 వేలు, తృతీయ బహుమతులు రవ్వ పులిహార చేసిన కలవచర్లకు చెందిన తవ్వ లక్ష్మితోపాటు పాల ముంజెలు చేసిన రామస్వామిపేటకు చెందిన వై.సుజాత వెంకటలక్ష్మిలకు రూ.2500 బహుతులగా ఇచ్చారు. వీటితోపాటు సర్టిఫికెట్లను రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ, జెసి అందజేశారు.

కందులను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తాం

రాష్ట్రంలో టెండర్లు ప్రకటించిన ఎవరు ముందుకు రాకపోవడం వలన ఈనెల గత రెండు నెలల నుంచి కందిపప్పు రేషన్ దుకాణాల్లో ఇవ్వలేదని రాష్ట్ర పౌర సరఫర శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అన్నారు. రైతుల నుండి ఏవిధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నాము అదేవిధంగా వచ్చే పంట నుండి రైతుల పండించిన కందిపప్పు నేరుగా కొనుగోలు చేయాలని సిఎం జగన్ నిర్ణయం తీసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం గోధుమపిండి పట్టణ ప్రాంతాల్లో ఇస్తున్నామని మరో రెండు నెలల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఇస్తామని చెప్పారు. త్వరలోనే గోధుమపిండి, కందిపప్పు, బియ్యం మూడు సరఫరా చేస్తారన్నారు. రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై పూర్తి ఆధారాలు ఉంటే కేసు నమోదు చేస్తామన్నారు.



సారె తీసుకువెళుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు

అమ్మవార్ల ఆలయాల్లో ఆషాఢ మాస ఉత్సవాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలోని పలు అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నిడదవోలు గోపవరం గ్రామంలో గుబ్బలమ్మ అమ్మవారి ఆషాఢ మాస శాకంబరి ఉత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారిని ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఎల్ఎతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గ్రామ ఎంపిటిసి సభ్యులు, గ్రామ వైసిపి అధ్యక్షులు, మండల, గ్రామ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలంలోని వేలివెన్ను గ్రామ దేవతలు మహంకాలమ్మ, ముత్యాలమ్మ లకు ఆదివారం గ్రామ ప్రజలు పలు రకరకాల పిండివంటలు, వివిధ రకాల పండ్లు, చీర, రవికెలు, పసుపు, కుంకుమలతో ఆషాడం సారె సమర్పించారు. సుమారు నాలుగు వందల మంది మహిళలు పసుపు రంగు పట్టు చీరలు ధరించి, సారె బిందెలను తలపై పెట్టుకుని, స్థానిక వేంకటేశ్వర స్వామిగుడి సెంటర్ నుంచి ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. గ్రామం మొత్తం ప్రత్యేక పూజలతో పండుగ వాతావరణం కనిపించింది.

కార్టూ'నిజం'



స్వదేశంలో... ఎవరూ నమ్మడం లేదయ్యా మరి..!!!

ట్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-యంత్రాంగం

టెన్త్ పరీక్షలో ప్రతిభకనబరిచి అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులు రాష్ట్రంలోని పలుచోట్ల ఉన్న ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సంద ర్భంగా వారిని పలువురు ఆదివారం అభినం దించారు.

సీతానగరం మండలంలో కాటవరం గ్రామంలోని శ్రీమహతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కృష్ణ నందన్ షైను మరియు పాతూరి వెంకటేష్ ఐఐఐటి ఒంగోల్లో సీట్లు సాధించారని ఆ స్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన కృష్ణనందన్ షైను మరియు పాతూరి వెంకటేష్‌లను, వారి తల్లిదండ్రులను శ్రీ మహతీ మేనేజ్మెంట్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ ఎల్ఎల్‌టి మరియు నీట్ ఫౌండేషన్ తీసుకున్నవారే అని ఐఐటి అకడమిక్ డైరెక్టర్ ఎఎస్.రాంప్రసాద్ తెలిపారు.ముగ్గళ్ల గ్రామానికి చెందిన గరికపాటి శిరీష టెన్త్‌లో 571 మార్కులు సాధించింది. శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈసందర్భంగా సీతా నగరం యుటిఫ్ మండల శాఖ విద్యార్థిని శిరీషను ప్రత్యేకంగా అభినం దించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు జియల్. సత్యనారాయణ మాట్లాడుతూ వెదళ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యను అభ్యసించిన శిరీష మండలంలోనే అత్యధిక మార్పులు సాధించడం గర్వ కారణమన్నారు. విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించిన వారిలో మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.రాంజీప్రసాద్, వి.వెంకటేశ్వరరావు, ఎం.గీతా, ఎం.తాతాజీ, పి. సత్తిబాబు, ఎస్ఎస్.ఇస్మాయిల్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచిగంటి బాల దుర్గా శిరీష, పోతా బత్తుల ఆనంద గోపాల్‌లు టెన్త్ పరీక్షల్లో ప్రతిభకనబరిచి శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు ఉండ్రాజవరం జెడ్‌పి హెచ్ఎం వి విశ్వప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించడం మండలానికి గర్వకారణమన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ మరింతమంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, ఈ విద్యార్థులు వారికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎం.వెంకట్రావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్.సోమేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కాటవరం 'శ్రీమహతి'యాజమాన్యం

సబ్సిడీపై బియ్యం అమ్మకాలు

ఎంపిక చేసిన రైతు బజార్లలో సూపర్ ఫైన్, ఫైన్, సాధారణ బియ్యం విక్రయాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

బహిరంగ మార్కెట్ లో బియ్యం ధరలు పెరిగి నందున రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా రైతు బజార్ల లో సూపర్ ఫైన్ రకం కిలో రూ. 46 లకు, ఫైన్‌రకం కిలో రూ.40లకు మరియు సాధారణ రకం కిలో రూ.34 చొప్పున విక్రయించాలని నిర్దేశించిందని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ తెలియ చేశారు. ఆదివారం స్థానిక క్వారీ మార్కెట్ సమీపంలో వున్న రైతు బజార్లో బియ్యం అమ్మకం కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జెసి తేజ్ భరత్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ హెచ్.అరుణకుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు బజారులో బియ్యం విక్రయించడానికి నిర్దేశించిన ప్రత్యేక స్టాల్ ను ప్రారంభించామన్నారు. నగరంలో ఈ విధమైన ప్రత్యేక స్టాల్స్ విఎల్.పురం, గణేష్ చౌక్, వై.జంక్షన్, శంభూ నగర్ రైతు బజార్లలో ఏర్పాటు చేయడమైనదని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఆధార్ కార్డు ద్వారా 5 కేజీలు విక్రయిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వినియోగించుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ నగరంలో రైతు బజార్లతో పాటు ఎంపిక చేసిన 6 రిటైల్ షాప్స్ ద్వారా పై మూడు రకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. రామకష్ణ రైస్ స్టోర్స్, సీతంపేట బీ లంక అప్పారావు రైస్ స్టోర్స్, తుమ్మలావ బి.వరలక్ష్మి రైస్ స్టోర్స్, జాంపేట బి.రవితేజ రైస్ స్టోర్స్, ఆల్కట్ తోట బి. మొల్లి ధనరాజు రైస్ స్టోర్స్, స్టేడియం రోడ్డు మరియు గ్రంధి చెంచయ్య రైస్ స్టోర్స్, క్వారీమార్కెట్‌ల్లో కూడా ప్రజలకు సబ్సిడీ పై అమ్మకాలు జరపడానికి వీలుగా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు రైతుబజారులే కాకుండారిటైల్ షాప్స్ నందుకూడా కొనుగోలు చేసుకోవచ్చు అని జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ తెలిపారు. రాజమహేంద్రవరం పట్టణంలో 5 రైతు బజార్లలో, 6 రిటైల్ షాపుల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ స్టాల్స్ ద్వారా ఇప్పటి వరకు సుమారుగా 100 క్వింటాల్స్ మేర బియ్యం విక్రయాలు జరిగినవని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయ భాస్కర్, డిఎం మార్కెటింగ్ ఎ.కుమార్, మార్కెటింగ్ ఎడి ఎమ్.సునీల్‌వినయ్, మరియు పౌర సరఫరాల శాఖ అధికారులు, వినియోగ దారులు పాల్గొన్నారు.



బియ్యంవిక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అరుణ్‌కుమార్



వైద్యులకు మొక్కలు అందజేస్తున్న దృశ్యం

బుర్రిలంకలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని బుర్రిలంక గ్రామంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల చిరు సేవాసమితి అధ్యక్షులు గెడ్డం శివ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ శిబిరంలో కందుల న్యూరో కేర్ ఆసుపత్రి వైద్యులు కందుల కృష్ణతేజ మరియు వైద్య సిబ్బంది పాల్గొని పలు రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల కృష్ణతేజ మాట్లాడుతూ తమ ఆసుపత్రి నందు అవసరం మేరకు ఉచితంగాను, నాణ్యమైన న్యూరో వైద్య సేవలు అందించడం జరుగు తుందని, ప్రజలు వినియోగిం చుకోవాలని కోరారు. ఈ శిబిరంలో వందలాది మంది రోగులు పాల్గొని వైద్యసేవలు పొందారు. అనంతరం వైద్యులను చిరు సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో కడియపులంక గ్రామ సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, వైస్ ఎంపిపి పంతం గణపతి, మాజీ సర్పంచ్ లు పుల్లా రామారావు, గట్టి నర్సయ్య, మార్గాని ఏడుకొండలు, ముద్రగడ జెమ్మి, మండల చిరు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

'ఆశా'ల ధర్నా విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల18న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని, డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు తెలిపారు. ఉండ్రాజవరంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆశా కార్యకర్తలతో సంబంధం లేని పనులు చేస్తున్నారన్నారు. దీంతోపాటు ఆశాలపై వస్తున్న రాజకీయ వేధింపులు భరించలేక వారు ఒత్తిడులకు గురువుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు పని భారాన్ని పెంచుతుందని, అదే స్థాయిలో వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ న్నికల ముందు ఆయన పాదయాత్ర లో ఆశాలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తూరుగోపు వెంకటేశ్వరరావు, ఆశాలు టి.త్యాగలక్ష్మి, పి.సుబ్బలక్ష్మి, దిట్ల భారతి, ఎ.సుజాత, ఎస్.సంధ్యారాణి, ఎం. లక్ష్మీదేవి, కె.విజయలక్ష్మి, టి.అనురాధ, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో ఆశా వర్కర్లతో కెవిపిఎస్ నాయకులు

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

గోతులతో చెరువుల మారిన ఆర్అండ్‌బి వలన ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొన్నారు. తాళ్లపూడిలో గడియారం సెంటర్ గా పిలవబడుతున్న ప్రదేశం వద్ద చెరువుల మారిన ఆర్అండ్‌బి రహదారిపై అనేక ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటన కూడా జరిగాయి. వారి ఇబ్బందులకు హోం శాఖ మంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె తాత్కాలిక మరమ్మతులు చేయాలని స్థానిక నాయకులను ఆదేశించారు. వ్యాపారవేత్త సింహాద్రి జనార్దనరావు సహకారంతో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖచొరవతో స్థానికులు బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, గోకవరపు మాణిక్యం పర్యవేక్షణలో అధికారులు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు.



తాళ్లపూడి గడియారంసెంటర్‌లో రోడ్డుకు మరమ్మతులు



వేగేశ్వరపురంలో పనులు పరిశీలిస్తున్న సర్పంచ

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

వర్షాకాలం కారణంగా వీధుల్లో మురుగు వర్షపు నీరు త్వరితగతిన బయటకు తరలించేందుకు డ్రైనేజీల్లో మట్టిని తీసేందుకు పూడికతీత పనులు చేపట్టామని వేగేశ్వరపురం గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, పెద్దేవం గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు తెలిపారు. వేగేశ్వరపురం గ్రామ కార్యదర్శి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరితగతిన పూడిక తీత పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. పనులను సర్పంచ్ కె.రామారావు పరిశీలించారు. పెద్దేవం గ్రామంలో జరుగుతున్న పనులను సర్పంచ్ వెంకటేశ్వరరావుతో పాటు వైసిపి నాయకులు తోట రామకృష్ణ పరిశీలించారు. వారు మాట్లాడుతూ డ్రైన్ పూడికతీత పనుల వలన గ్రామంలోని అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా బయటకు పోతుందన్నారు. శాశ్వత డ్రైన్ తో పాటు ప్రత్యేక విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి వనిత నిధులు మంజూరు చేశారని అన్నారు.

నీట మునిగిన నారుమడుల పరిశీలన

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలు గ్రామ పరిధిలో లింగాల చెరువు ఆయకట్టులో దాదాపు 150 ఎకరాల కాకినాడ కెనాల్ నీటిఉధృతి కారణంగా నీట మునిగిన నారు మడులు, నాట్లను ఆదివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బిక్కవోలు గ్రామ పరిధిలో లింగాల చెరువు ఆయకట్టులో దాదాపు 150 ఎకరాల పరిస్థితి ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రైతులు నారు మడులు వేసుకోడానికి సాగునీరు ఇవ్వలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. రెండు రోజులుగా నీరు ఓవర్ ఫ్లో అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కాలువలలో కానీ,మురుగు కాలువలలో గుర్రపు డెక్క ఇతర వ్యర్థలు పేరుకు పోయాయన్నారు. వేసవిలో క్లోజ్ ఆన్ పీరియడ్ లో కూడా వాటిని క్లియర్ చేయలేదన్నారు. ఇదే పరిస్థితి అనపర్తి, బిక్కవోలు మండలాలలో చూసుకుంటే, బిక్కవోలులో కెనాల్ రోడ్ కి, రైల్వే ట్రాక్ కి మధ్యన ఉన్న భూములు అన్ని కూడా నిన్న ముంపుకు గురి అయిన పరిస్థితి. వేసవిలో పూడికతీత తీయాలన్నారు. అదే విధంగా డ్రైయిన్స్ , కెనాల్స్ క్లియర్ చేయాలి, గుర్రపు డెక్క తదితర వ్యర్థాలు తొలగించాలని, అప్పుడూ రైతులకు సక్రమంగా నీరు అందే పరిస్థితి ఉంటుం దన్నారు. ఈవేళ జిల్లాలో ఉన్న మంత్రులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ఎవ్వరు రైతుల సమస్యలపై స్పందించే తీరిక కానీ, స్పందించే పరిస్థితి కానీ లేదు. టిడిపి తరపున రైతులకు అండగా ఉంటామన్నారు. నీరు తగ్గించకపోతే ఎస్ఇ ఆఫీస్ ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి, తూర్పు గోదావరి జిల్లా తెలుగు రైతు కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి త్రిమూర్తులు, గ్రామ శాఖ అధ్య క్షులు చిట్టిబాబు చౌదరి, అనపర్తి నియోజకవర్గ వాణిజ్య విభాగ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్‌శ్రీను తదితరులు పాల్గొన్నారు.




పంటపొలాలను పరిశీలిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు పట్టణంలో చాలా చోట్ల వీధిలైట్లు 24 గంటలు వెలిగే ఉంటాయని స్థానికులు తెలిపారు. పంచాయతీలకు ఆదాయం వస్తుందని ట్యూబ్ లైట్లు స్థానాల్లో ఈ లైట్లు వేసిన నుంచి వీధిలైట్ల వెలిగే ఉంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. కొన్నిచోట్ల వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతుంటే ఉన్నచోట్ల వీధిలైట్లు ఆపకపోవడంతో స్థానికులు పంచాయతీకి ఆదాయం నష్టమని తెలిపారు.



వెలుగుతున్న వీధిలైటు

నేరాలు ఘోరాలు



నాగులపల్లిలో దారుణం

అత్త, భార్యపై కత్తితో దాడి

అత్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

భార్య, అత్తపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అత్త అక్కడిక్కడే మరణించగా భార్య తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలైంది. ఈఘటన నాగులపల్లిలో శివారు ఉప్పరగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దండు శ్రీను, సింహాచలంకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శ్రీనుకు ముందు నుంచి భార్య సింహాచలంపై అనుమానం ఉండేది. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. దీంతో ఆమె తరచూ ఉప్పరగూడెంలో పుట్టింటికి వచ్చేది. అయితే ఏడాదిగా సింహాచలం పుట్టింటి వద్దే ఉంటోంది. శ్రీను కూడా ఇక్కడే ఉంటున్నాడు. అయినా అనుమానం తగ్గలేదు. దీంతో భార్యను హతమార్చాలని అనుకున్నాడు. ఆదివారం ఇంటి వద్ద పనులు చేసుకుంటున్న సింహాచలంపై కత్తితో దాడికి తెగబడ్డాడు. దీనిని చూసిన సింహాచలం తల్లి గుబ్బల రాణి(50) అడ్డుకుంది. వారించే ప్రయత్నం చేసింది. ఈ సమయంలో శ్రీను ఆమెపై కూడా దాడికి పాల్పడ్డాడు. ఆమెకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సింహాచలంను స్థానికులు హుటాహుటిన పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పిఠాపురం సిఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి దుర్మరణం

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు, రామచంద్రపురం

ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తాళ్లరేవు మండలం కోరంగి కనకదుర్గమ్మ గుడి వద్ద 216వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఐషర్ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన బి.నాగవెంకటగంగాధర్, ఏడిద హర్షవర్ధన్ బైకుపై కాకినాడ వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఐషర్ వ్యాను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షత గాత్రుని అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఆదివారం కాకినాడ నుంచి యానాం వైపు తాటిపాక ఒఎన్‌జిసి సైట్‌కి వెళ్తున్న ట్యాంకర్‌ను కాకినాడ వైపు వెళ్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పెదపూడికి చెందిన సతీష్, రాజేష్‌లకు బలమైన గాయాలయ్యాయి. సంఘటన స్థానానికి చేరుకున్న కోరంగి ఎస్.ఐ. శ్రీనివాస్ కుమార్, 108 సిబ్బంది క్షతగాత్రులను కాకినాడ జిజిహెచ్.కు తరలించారు. డాక్టర బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండాలమ్మ పేటకు చెందిన దుర్గటి భైరవ స్వామి కోటిపల్లి రోడ్డుపై వస్తుండగా శివల గ్రామానికి చెందిన బత్తుల అరుణకుమార్ యానాం వైపు నుంచి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి ద్రాక్షారామ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి-గోకవరం

సారా బట్టీలపై ఆదివారం ఎస్ఇబి అధికారులు దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేశారు. రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన గంధం మరిడియా, గంధం అర్జున్, కేత ఈశ్వరరావు, అరుగొల్లి సూర్యచంద్రం కృష్ణునిపాలెం శివారులో సారా బట్టీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఇబి సిబ్బంది దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి 25 లీటర్ల సారా, 2 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్ఇబి అధికారులు తెలిపారు.

క్వారీ గోతుల్లో యువకుడి మృతదేహం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం- జగ్గంపేట రహదారి సూరంపాలెం పుంతలో ఉన్న క్వారీ వద్ద ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఉన్న యువకుడి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన నడిపల్లి వంశీ(28)దిగా గుర్తించారు. సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ వి.సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

'ఉపాధి'లో విరివిగా మొక్కల పెంపకం

ప్రజాశక్తితో డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించిందామని కాకినాడ జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. నాటేందుకు గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు పెరిగేంతవరకు దాదాపు అన్ని ఖర్చులు ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకం పై చాలామందికి పూర్తిస్థాయి అవగాహన లేక ప్రభుత్వం అందించే రాయితీలకు దూరమవుతున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై ఆమె ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ఎన్ని ఎకరాల్లో ఉద్యాన తోటలు పెంచుతున్నారు.?

హార్టికల్చర్ ప్లాంటేషన్ లో భాగంగా మొక్కల పెంపకానికి ఇప్పటి వరకు 234.25 ఎకరాలు పరిపాలనా మంజూరు తీసుకోవడం జరిగింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఉద్యాన తోటల పెంపకం రైతులను గుర్తించడం, పరిపాలనా ఆమోదం పూర్తి చేశాం. ఈనెల 7నాటికి గుంతలు తవ్వడం, 15 నాటికి మొక్కలు నాటడం పూర్తి చేశామన్నారు. హార్టికల్చర్‌లో భాగంగా ఫ్లోరి కల్చర్‌లో గులాబీ, మల్లె తోటలను పెంచడానికి 12.75 ఎకరాలు పరిపాలనా మంజూరు తీసుకున్నామన్నారు.

మునగ పెంపకం ఎన్ని ఎకరాల్లో సాగు జరుగుతుంది.?

మునగ మొక్కల పెంపకం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 15 ఎకరాలు అంచనాలు తయారు చేసి, 8 ఎకరాలు పరిపాలనా మంజూరు చేశామన్నారు. లబ్ధిదారుల గుర్తింపు ఇంకా జరుగుతుంది. రైతు ఆసక్తిని బట్టి పొలం గట్ల మీద కొబ్బరి, మునగ, టేకు తదితర రకాలు వేసుకోవచ్చు. 10 ఎకరాలు లక్ష్యంగా తీసుకున్నాం.

కమ్యూనిటీ ప్లాంటేషన్ లక్ష్యం ఎంత తీసుకున్నారు.?

కాలవగట్లు, అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఇప్పటి వరకు 3 కిలోమీటర్లు పరిపాలనా మంజూరు తీసుకున్నాం. ఇంకా పనులు గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. వీటికి సంబంధించిన మొక్కలను డ్వామా నర్సరీ నుండి పంపిణీ చేస్తాం. కొబ్బరి, మామిడి, మునగ తదితర రకాల మొక్కలను చెరువు గట్లు, పంచాయతీ ఖాళీ స్థలాల్లో వేసుకోవచ్చు. ఇప్పటి వరకు 12 ఎకరాలు పరిపాలనా మంజూరు తీసుకున్నాం.

ప్రభుత్వ సంస్థల్లో ఏయే రకాల మొక్కలను పెంచుతారు.?

ప్రభుత్వ సంస్థల్లో అన్ని రకాల పండ్ల మొక్కలు, నీడ నిచ్చే మొక్కలను వేసుకోవడానికి అవకాశం ఉంది. ప్రహరీ ఉండి నీటి వసతి గల ప్రభుత్వ సంస్థల్లో కనిష్టంగా 50 మొక్కల నుంచి 1000 మొక్కల వరకు వేసుకోవచ్చు. త్వరలో వీటిని పంపిణీ చేస్తాం.

డ్వామా నర్సరీలు ఎక్కడెక్కడ ఉన్నాయి.?

కమ్యూనిటీ ప్లాంటేషన్లకు మొక్కలు సరఫరా చేయడానికి డ్వామా నర్సరీలను ఏర్పాటు చేశాం. తాళ్లరేవు మండలం డ్వామా నర్సరీలో సుమారు 5000 మొక్కలు పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెం, శంఖవరం మండలం కేంద్రంలో నర్సరీలను గుర్తించాం. ఇక్కడ 50 వేల మొక్కలకు రూ.6 లక్షల వరకు నిధులు అంచనా వేస్తున్నాం.

మునగ మొక్కల పెంపకానికి ఎటువంటి చర్యలు చేపట్టారు.?

ప్రతీ మహిళకు ఆరోగ్య పరిరక్షణ పెంపొందించడానికి మునగ మొక్కలను అందిస్తున్నాం. మునగలో కాల్షియం, ఐరన్ తో సహా అనేక పోషకాలు ఉన్నందున ప్రతీ ఇంటికి ఒక మునగ మొక్క ఇవ్వాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించింది. గత సంవత్సరం కాకినాడ రూరల్ మండలంలో 5 వేల మొక్కలకు వేతనదారులకు పంపిణీ చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం గండేపల్లి మండలాన్ని గుర్తించాము. ఆసక్తి ఉన్నవాళ్లు ఉపాధి హామీ పథకం సిబ్బందిని సంప్రదిస్తే మొక్కలను అందజేస్తాం.

'వేలం' దుమారంపై ఇఒ దిద్దుబాటు చర్యలు

సంభావన హక్కు కింద టెండర్ పిలిచే ఆలోచన

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానంలో పెళ్లిళ్లకు ఉపనయనాలకు నిర్వహణ చేసే పురోహితులకు దేవస్థానం అధికారులు ఇటీవల నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్ణయం అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా పలు బ్రాహ్మణ సంఘాల నిరసనలతో రాజకీయ దుమారం రావడంతో దేవస్థానం ఇఒ ఆజాద్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు ఇందులో భాగంగా, పెళ్లిళ్ల ఉపనయనాలు నిర్వహణకు సింగిల్ సింగిల్ విండో విధానం ద్వారానే పురోహితులకు సంభావన హక్కు కింద టెండర్ లేదా నామినేషన్ పద్ధతిలో ఇచ్చేందుకు ఆలోచిస్తున్నామని, ఈ అంశంపై ఈ నెలలో 23న జరిగే పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు అంతేగాక ఈ విధానం కూడా స్థానిక పురోహితులకు రెండు మూడు బ్రాహ్మణ సంఘాలకు ఈ సంభవన హక్కు లైసెన్స్ పొందే విధంగా నిబంధనలు రూపొందించే ఆలోచన కూడా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా బయట ఉన్న బ్రాహ్మణ సంఘాలు ఈ విధానం రద్దు చేయమని రద్దు చేయకుంటే ఆందోళన చేస్తామని, ఈనెల 28న అమలాపురం వచ్చే ముఖ్యమంత్రి జగన్ కూడా కలిసి తమ నిరసనలు గురించి చెబుదామని ఇప్పటికే స్థానికేతర బ్రాహ్మణ సంఘాలు పలు సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయినా దేవస్థానం ఆజాద్ తనదైన శైలిలో పురోహితులకు సంభావన హక్కు, లైసెన్స్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం ఏదేమైనా దేవస్థానం ఇఒ తీసుకుంటున్న నిర్ణయాలు గోరుచుట్టుపై రోకలి పోటు అన్న రీతిలో ఉంటున్నాయని ఈ సందర్భంగా స్థానికేతర పురోహితులు బ్రాహ్మణ సంఘాల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

యానాం వార్తలు



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

ఘనంగా పెన్షనర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కమలా నెహ్రూ గర్ల్స్ హై స్కూల్ ప్రాంగణంలో యానాం పెన్షనర్స్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవ వేడుకలు అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్ఎఒ మునిస్వామి, ఎస్పి రఘునాయగం పాల్గొని అసోసియేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. యానాం పెన్షనర్స్ అసోసియేషన్ ప్రారంభించి 25ఏళ్లపూర్తి చేసుకున్న సందర్భంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్స్‌ను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంతరం జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గత సంవత్సరం మరణించిన పెన్షనర్స్‌కి నివాళు లర్పించారు. అసోసియేషన్‌కి సంబంధించి ఇతర అంశాలను చర్చించారు. అసోసియేషన్ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే తక్షణమే 25 వేల రూపాయలు సహాయాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పడాల వెంకటేశ్వరరావు,సెక్రటరీ బస్వా వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ దంగుడుబియ్యం సత్యనారాయణ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ ఆధ్వర్యంలో స్థానిక కెఎన్‌జిజి హైస్కూల్లో నిర్వహించిన యానాం పెన్షనర్స్ అసోసియేషన్ వార్షికోత్సవ సభలో సుమారు 150 మందికి సోమవారం నేత్రదానంపై అవగాహన కల్పించినట్లు ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులచే నేత్రదానం ప్రతిజ్ఞ చేయించి, పత్రాలపై సంతకాలు సేకరించామన్నారు. ఈ కార్యక్రమానికి దంగుడుబియ్యం సత్యనారాయణ, దుళ్ళ రామకృష్ణ సహాయ సహకారాలు అందించారన్నారు.

బిసిల కులగణనే ఎజెండా

బిసిల ఆత్మగౌరవ సభలో వక్తలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

బిసిల కులగణనే ఎజెండాగా ముందుకు సాగాలని బిసిల ఆత్మగౌరవ సభలో వక్తలు పిలుపునిచ్చారు. కాకినాడ సూర్య కళామందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అధ్యక్షత వహించగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య,పార్లమెంట్ సభ్యులుపిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసిలకు సమగ్ర శాస్త్రీయ కులగణన నిర్వహించిన నాడే రిజర్వేషన్లు సాధించుకోగలమన్నారు. ఎప్పటినుంచో కుల గణనను అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తూ వస్తున్నాయన్నారు. బిసిల హక్కుల కోసం ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా పోరాటం చేయలేదన్నారు. హక్కుల కోసం పోరాడాలన్నారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ బిసిల జనగణన కోసం ముఖ్యమంత్రి జగన్ ప్రయత్నం చేస్తే హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. కుల గణన కోసం జరిపే పోరాటానికి మల్లాడి నాయకత్వం వహించాలన్నారు. మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండ బాబు మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలనేది కలగానే మిగిలిపోతుందన్నారు. మాజీ మంత్రి మల్లాడి మాట్లాడుతూ బిసిల హక్కుల కోసం పోరాటమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. రాజకీయ పార్టీల్లో దొంగ బీసీలు ఉన్నారని, దొంగ సర్టిఫికెట్లతో రాజకీయాల్లో చలామణి అవుతున్నారని మల్లాడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఎ.రమేష్, చెల్లుబోయిన వేణుగోపాల్, ఎం.భాస్కర్‌గణేష్, పి.దుర్గారమేష్, మాజీ ఎంఎల్‌సి బలశాలి ఇందిర, ఎస్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రమణయ్యపేట ఆంజనేయ నగర్ ఆదర్శ వయోవృద్ధుల ఆశ్రమంలో ట్రినిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఖండవిల్లి షాలిని మాట్లాడారు. వృద్ధాప్యంలో కీళ్లకు సంబంధించిన వ్యాధులు వేధించే అవకాశం ఉందన్నారు. కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కీళ్లలో నొప్పి లేదా వాపు, చర్మంపై ఎర్రటి మచ్చలు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కండరాల బలహీనత తదితర లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స తీసుకోవాలన్నారు. అదేవిధంగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులు అనారోగ్యంగా ఉన్నా వైద్యులను సంప్రదించలేని పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి స్థితిలో సామాజిక బాధ్యతగా ట్రినిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కిషోర్ పేకేటి, వీరేంద్ర, సునీత తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

భూసమస్యలపై నేడు కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రప్పాలెం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 270/2ఎ లో ఉన్న 10.9 ఎకరాల భూమికి సంబంధించిన సమస్యలపై సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని రామవరం శివారు రంగవల్లి నగర్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ భూమిని గుర్రప్పాలెంలో ఉన్న దళితులు, పేదలు సాగుచేసుకుని ఉపాధి పొందేవారన్నారు. జగ్గంపేట ఎంఎల్ఎ అనుచరులు ఈ భూమిని దళితుల నుంచి దౌర్జన్యంగా లాగేసుకున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆరు నెలలుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా, అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కనబెట్టి రాజకీయ నాయకులకి వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. దీంతో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చామన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి కె.సతీష్, డివిజన్ నాయకులు సురేష్, పిఒడబ్ల్యు స్త్రీ విముక్తి నాయకురాలు దేవి పాల్గొన్నారు.

వాసవి అమ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాడమాసం ముగింపులో భాగంగా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు భారీ ఎత్తున సారె సమర్పించారు. కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి ఆర్యవైశ్య మహిళలు స్థానిక రామకృష్ణ కళ్యాణ మండపం నుంచి పెద్ద బజారు మీదుగా ర్యాలీగా సారెను తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆర్యవైశ్య మహిళలు తెచ్చిన వివిధ రకాల పువ్వులు ,పండ్ల రకాలు, పలు రకాలు స్వీట్లు, వస్త్రాభరణాలు ఆలయాన్ని, అమ్మవారిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు వాసవి మహిళా భక్త సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని కేశవరం గ్రామంలో పల్లపువీధిలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపిటిసి సభ్యులు అన్నందేవుల కృష్ణతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో కేశవరం గ్రామం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు.

6వ రోజుకు రైతుల రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని గోకివాడలో అక్కినీడి వారి చెరువుకు నీరు వెళ్ళే పుట్టకుంట కాలువపై అధికారులు తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటు చేయాలని రైతులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో రైతులు నామా శివయ్య, గాది సుబ్రహ్మణ్యం, నామా పూసలు, గరగ వెంకట్రావు, అమలకంటి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అధికారులు షట్టర్లు తొలగించడంతో గ్రామంలో పంటలకు నీరందట్లేదన్నారు. తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటుచేసి సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నామా వెంకట్రావు, గరగ సత్యానందం, వెలుగుల పద్దరాజు, కొత్తెం స్వామి, కాయల పవన్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు శాకాంబరి అలంకరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని రామారావుపేటలో నూకాలమ్మను ఆదివారం శాకాంబరి అవతారంలో అలంకరించారు. చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఇఒ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆలయాన్ని మొత్తం పండ్లు, పువ్వులు, ఇతర ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారి పూర్తిగా ఆకుకూరలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గుడ్డుతో పలు ప్రయోజనాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

గుడ్డుతో పలు ప్రయోజనాలున్నాయని విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు గుడ్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోటీన్, కాల్షియం, అనేక విటమిన్లు కలిగిన గుడ్డు పోషకాలకు మూలమన్నారు. గుడ్డులో విటమిన్-ఎ ఎక్కువగా ఉండటంతో కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. మంచి కొలెస్ట్రాల్ స్థాయిని కూడా పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, జి.కృష్ణమోహన్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయరాదు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మధుమేహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయరాదని గ్రంథాలయ విశ్రాంతి ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రినిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచితంగా రక్త పరీక్షలు, బిపి పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షల ద్వారా శరీరంలో చక్కెర స్థాయిని తెలుసుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ట్రినిటీ ఆసుపత్రి పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

కౌలుకు చేస్తున్న పొలం విషయంలో వివాదం రావడంతో పురుగుల మందు తాగిన పికె.రాయపురం గ్రామానికి చెందిన కరణం రమణ ఆదివారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం ఈ నెల 4న బోయినపూడిలో కౌలుకు చేస్తున్న పొలం విషయంలో కుటుంబ సభ్యులతో గొడవల కారణంగా పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారని పోలీసులు తెలిపారు. కుమారుడు కరణం సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

మునికూడలి ఇసుక ర్యాంపులో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మునికూడలిలో ఇసుక ర్యాంపులో ఆదివారం ఎస్ఇబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. జగనన్నకు చెబుదాంలో నమోదు కాబడిన అర్జీ మేరకు మునికూడలి, వెదుళ్లపల్లి రైతుల పట్టా భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. పట్టాభూములు ప్రక్కలంక రెవెన్యూ పరిధిలో ఉన్నందున ప్రక్కలంక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరుకొండ ఎస్ఇబి సిఐ సత్యనారాయణ రైతులకు తెలిపారు. అనంతరం కాటవరంలో నిల్వచేసిన ఇసుక గుట్టలకు సంబంధించి విచారణ చేశారు. సిఐ సత్యనారాయణ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మునికూడలి ఇసుక ర్యాంపులో ఇసుక తరలించిన ప్రాంతంలో వరద నీరు చేరడంతో ఎంతమేరకు తవ్వకాలు జరిగాయో అంచనాలు తెలియదని తెలిపారు. ఈ మేరకు నివేదిక అందిస్తామన్నారు.



ర్యాంపు పరిశీలనకు వచ్చిన అధికారులు

200 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత చర్మం వ్యాధుల వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. కాకినాడ నుంచి డాక్టర్ చిత్రలేఖ తదితరులు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఈ వైద్యసేవలు పొందారు. వైద్యులు, మెడికల్ రిప్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పిఎంపి కె.విజయ్ కుమార్, ఉప్పాడలో ఉన్న సూర్య మెడికల్ షాప్ యజమాని మాట్లాడుతూ. మారుతున్న కాలంలో స్కిన్ డిసీస్ అనేదే ప్రతి ఒక్కరికీ వస్తుందన్నారు. చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మల్లేపల్లి శివారులో పెట్రోల్ బంకు ఎదురుగా ఆదివారం ఒక కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు ముందుగా వెళ్తున్న బైకును తప్పించబోయి అదుపుతప్పి సెంటర్ డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహనం సిబ్బంది వచ్చి కారును డివైడర్ పైనుంచి తొలగించారు.



సీజనల్ వ్యాధులతో ముప్పు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వర్షాలు అధికంగా కురవడంతో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, విష జ్వరాలు వేధించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ గౌరీ శేఖర్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కాలంలో జలుబు, దగ్గు, ఎసిడిటి, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు కూడా వేధిస్తాయన్నారు. వీటి నివారణకు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బయట ఆహార పదార్థాలను తీసుకోరాదన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ , బుద్ధ రాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.